క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



బూరుగలో కవాతు చేస్తున్న సాయుధ బలగాలు

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే తమ లక్ష్యమని ఎస్ఐ షేక్ ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం కేంద్ర సాయుధ బలగాలతో కలిసి బూరుగ, చలివేంద్రి, దశుమంతపురం, మహదేవివలస, సంత–నర్సిపురం గ్రామాల్లో కవాతు చేశారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓటు హక్కు ఉన్న ప్రతీ ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్ఐ కోరారు.

వెండి కిరీటం అలంకరణ



మాతా విగ్రహానికి వెండి కిరీటం అలంకరిస్తున్న దాతలు

భామిని: మండలంలోని బిల్లుమడలో వెలసిన శ్రీమజ్జిగౌరమ్మ తల్లికి ఉగాది సందర్భంగా వెండి కిరీటం అలంకరించారు. బిల్లుమడకు చెందిన వ్యాపారి రుగడ లక్ష్మీనారాయణ దంపతులు వెండి కిరీటం అందజేశారు. ఉగాది సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సుభద్రమ్మవలసలో ఏనుగుల సంచారం




సుభద్రమ్మవలస రహదారి పక్కన ఉన్న వరిచేలలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస ప్రధాన రహదారిపై మంగళవారం ఏనుగులు దర్శనమిచ్చాయి. రోడ్డు పక్కన వరి, అరటి, పామాయిల్, జొన్న పంట తింటూ రహదారిపైకి రావడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల తరలింపునకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రెండు మట్టి ట్రాక్టర్ల సీజ్

పాలకొండ: మండలంలోని తంపటాపల్లి గ్రామంలో చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టలను సీజ్ చేశామని నీటిపారుదల శాఖ జేఈ శంకరరావు తెలిపారు. చెరువులో మట్టిని తరలిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు పరిశీలించామని, రెండు ట్రాక్టర్‌లతో మట్టిని తరలించడాన్ని గుర్తించి సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించామని తెలిపారు.

అందుబాటులో ఆయుష్ మందులు



ఆయుర్వేద అస్పత్రితో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ టి.హేమాక్షి

సీతానగరం: మండలంలోని బూర్జ ఆయుష్ ఆస్పత్రిలో ఉన్న మందులతోనే దీర్ఘకాలిక వ్యాధులు తగ్గుతాయని ఆయుష్ వైద్యాధికారి టి.హేమాక్షి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె బూర్జ ఆయుర్వేద ఆస్పత్రిలో మాట్లాడుతూ గ్రామాల్లో కీళ్లవాపులు, నొప్పులు, జలుబు దగ్గు, ఉబ్బసం, ఊబకాయం, సుగర్, కాళ్లుచేతులు తిమ్మిర్లు ఎక్కడం, మలబద్ధకం, అతి మూత్రం తదితర వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఇటీవల నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో గుర్తించినట్లు చెప్పారు. సురక్ష వైద్యశిబిరాలు నిర్వహించిన నాటి నుంచి ఆయుర్వేద మందులపై రోగుల్లో నమ్మకం కలిగిన తరువాత గ్రామాల్లో ఉచితవైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులు అందజేస్తున్నామని తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణమంతా మరమ్మతులు చేపట్టడం, ఆస్పత్రిని అభివృద్ధి చేయడంతో నీటివనరులు సమకూర్చుకుని ఆస్పత్రి ప్రాంగణంలో నర్సరీ పెంపకం చేపట్టినట్లు చెప్పారు. అందుబాటులో లేని ఔషధ మొక్కలను దూర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో సేకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆస్పత్రిలో ఆయుర్వేద మందులతో పాటు యోగాసనాలతో వ్యాధులను నయం చేయనున్నట్లు తెలియజేశారు. యోగాసనాలు వేయడానికి శిక్షణ పొందిన ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించినట్లు చెప్పారు. ఆయుర్వేద మందులతో పాటు యోగాసనాలు వ్యాధి నిర్మూలనకు దోహదపడుతున్నాయని స్పష్టం చేశారు.

వేడుకగా ఉగాది

క్రోధినామ ఉగాది వేడుకలు అన్ని చోట్ల మంగళవారం ఘనంగా జరిగాయి. దేవాలయాల వద్ద పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. పలుచోట్ల కవి సమ్మేళనం నిర్వహించారు. వేకువజామునే రైతులు ఏరువాక చేశారు. దేవాలయాల వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ రాశి ఫలాలను పురోహితులను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.



గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వర ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు సుధాకరశర్మ, తదితరులు

సీతంపేట: క్రోధినామ ఉగాది పర్వదినాన్ని పురష్కరించుకుని స్థానిక లక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వేమకోటి సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ పఠనం చేశారు. భక్తులు తమ రాశి ఫలాలను తెలుసుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

పాలకొండ : శ్రీసూర్యచంద్రకళా సాహితి ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు కవి గాయక సమ్మేళనం, తెలుగు పద్యాల పోటీలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులకు తెలుగు పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తెలుగు కవులను సన్మానించారు. బొరోతు శంకరరావు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో తెలుగు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

పురస్కారాల అందజేత

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో కొలువుదీరిన శ్రీమద్‌విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో మంగళవారం తెలుగు సంవత్సరాది వేడకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో పంచాంగ పఠనం చేపట్టారు. ఈ క్రమంలో విశ్వకర్మ కమ్యూనిటి వారిచే నీట్, ఐఐటీలో ప్రతిభ కనబర్చిన, వృత్తిరీత్యా ప్రజలకు సేవలందిస్తున్న, ఉన్నత శాఖల్లో విధులు చేపడుతున్న, వృద్ధ కళాకారులకు, దంపతులకు ఉగాది పురస్కారాలను అందించారు. ఎంఈఓ చింతలూరి భాస్కరరావు, ఏరియా ఆస్పత్రి వైద్యులు కడియం చిరంజీవి, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు అరటికట్ల కామేశ్వరరావు, కె.జనార్ధనరావు, బుక్కూరు భువనేశ్వరరావు, పంచ వృత్తులకు చెందిన ఐదురుగు వయో వృద్ధ దంపతులను ఘనంగా సన్మానించారు. పురస్కారాలను ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ మహేష్‌బాబు, ఎస్.నారాయణరావు, ఎ.దుర్గాప్రసాద్, బ్రహ్మం తదితరులు అందించారు. ఉత్తమ విద్యార్థులకు రూ.10వేల వంతున నగదు ప్రోత్సాహకాలను అందించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా మండల పరిధిలో విద్యార్థులకు వేమన, సుమతి శతకాలకు చెందిన పద్య విభాగంపై పోటీలు నిర్వహించారు. అనంతరం కవి సమ్మేళన కార్యక్రమం ద్వారా తెలుగు జాతి ఖ్యాతిని సీనియర్, వర్ధమాన కవులు కీర్తించారు. కార్యక్రమంలో కె.చౌదరినాయుడు, బి.గణేష్‌బాబు, శ్రీదేవి, ఎస్.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, సూరన్నాయుడు పౌరాణిక, జానపద గేయాలను ఆలపించి అలరించారు.



పాలకొండ రూరల్: వయో వృద్ధులను సన్మానిస్తున్న ఉద్యోగులు, కమిటీ సభ్యులు

గరుగుబిల్లి: మండలంలోని ఊరూరా మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. రైతులు వేకువజామునే కొత్త బట్టలు ధరించి తమ పొలాల్లో నాగళ్లతో దుక్కులు దున్నారు. అనంతరం మామిడి తోరణాలతో ఇంటి ముంగిళ్లను అలంకరించారు. ఉగాది పచ్చడిని తయారుచేసి భక్తితో సేవించారు. సాయంత్రం ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేసి ఈ ఏడాది తమ రాశి ఫలాలు ఏవిధంగా ఉన్నాయో తెలుసుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.



సీతంపేట: లక్ష్మీగణపతి ఆలయంలో పంచాంగ శ్రవణం వినిపిస్తున్న భక్తులు

తోటపల్లిలో పంచాంగ శ్రవణం

తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. ఆలయంలో పెదపెంకి గ్రామానికి చెందిన తెలుగుపండిట్ పొందూరు సుధాకుమార్ శర్మ పంచాంగ పఠనం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో అందరికి శుభ ఫలితాలు ఉంటాయని వివరించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు.

- **కురుపాం:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది పండగను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు వేకువజామున ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఉగాది పచ్చడి, పిండివంటలు తయారు చేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి ఆరగించారు. మండల కేంద్రంలో గుంప సోమేశ్వరస్వామి దేవస్థానం అర్చకులు శ్రీనివాసరావు పంచాంగ పఠనం చేశారు. క్రోధి నామ సంవత్సరంలో వివిధ రాశుల వారి రాశిఫలాలు ఏవిధంగా ఉన్నాయో వివరించారు.
- **జియ్యమ్మవలస:** మండలంలోని అన్ని గ్రామాలలో ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం 4 గంటలకే రైతులు ఏరువాక కార్యక్రమం నిర్వహించారు. ఇంటిల్లపాది కొత్తబట్టలు ధరించి పిండివంటలు చేసుకుని సరదాగా గడిపారు.

సందడిగా ఉగాది సంబరాలు

వీరఘట్టం: శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం మండల వ్యాప్తంగా సందడిగా సాగాయి. రైతులు తెల్లవారేసరికి కొత్త నాగళ్లతో పొలాలు దున్ని విత్తనాలు వేశారు. మహిళలు ఇంటిలో షడ్రుచుల ఉగాది పచ్చడి చేసి స్వీకరించారు. స్థానిక శ్రీరమా సత్యన్నారాయణ స్వామి ఆలయంలో పురోహితులు సర్వాజోశ్యుల చంద్రమౌళీ శర్మ పంచాంగ పఠనం చేశారు.



పాలకొండ: ఉగాది వేడుకల్లో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సాహితీ వేత్తలు



కురుపాం: పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు



వీరఘట్టం: శ్రీరమా సత్యనారాయణ స్వామి ఆలయంలో పంచాగ శ్రవణంలో పాల్గొన్న స్థానికులు

భామినిలో...

భామిని: మండలంలోని గ్రామాల్లో క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణాలు కొనసాగాయి. భామిని కీర్తిరాయి దొరల ఇంట బత్తిలి పురోహితులు రంపా లలిత ప్రసాద్ శర్మ, నేరడి–బిలో రంపా శ్రీనివాసశర్మ, బత్తిలి సంతోషిమాతా ఆలయంలో రంపా తాతబాబు శర్మ, కోటదుర్గమ్మ గుడి ప్రాంగణంలో రంపా ఎర్రబాబు శర్మల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేశారు. రాశి ఫలాలు వివరించారు.

నాడు రాళ్లదారి.. నేడు బీటీ రోడ్డు

ప్రజల మేలుకోరే నాయకులు పాలకులైతే.. ఏ మేరకు అభివృద్ధి, సంక్షేమం చేకూరుతుందనేందుకు గత 58 నెలల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనే నిదర్శనం. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి చొరవతో వందలాది గిరిజన గూడలకు 'మార్గం' సుగమమైంది. రాళ్లదారులు బీటీ రోడ్లుగా మారాయి. దీనికి కొమరాడ మండలంలోని విక్రంపురం గ్రామం నుంచి కంచరపాడుకు వెళ్లే రోడ్డే నిదర్శనం. రాళ్లతో ఉన్న కంచరపాడు రోడ్డును రూ.5కోట్ల 33 లక్షల ఖర్చుతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో బీటీ రోడ్డుగా నిర్మించడంతో రాకపోకల సమస్య తీరిందంటూ ఈ ప్రాంత ప్రజలు సంతోషపడుతున్నారు. అటవీ ఉత్పత్తుల తరలింపు సులభతరమైందని, మేలుచేసే పాలకులకు అండగా ఉంటామని చెబుతున్నారు. – కురుపాం



నేడు: రూ.5.33 కోట్ల వ్యయంతో నిర్మించిన విక్రంపురం-కంచరపాడు రోడ్డు (ఇన్‌సెట్లో) నాడు: కొమరాడ మండలం విక్రంపురం నుంచి కంచరపాడుకు వెళ్లే దారి

నాడు అధ్వానం.. నేడు అద్భుతం

కురుపాం: కొమరాడ మండలం సరుగుడుగూడ నుంచి సంకేసు గ్రామం వైపు వెళ్లే ఘాట్‌రోడ్డు గతంలో రాళ్లు తేలి అధ్వానంగా ఉండేది. ఈ రోడ్డులో ప్రయాణించేందుకు వాహనదారులు అవస్థలు పడేవారు. రహదారి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు గత ప్రభుత్వ పాలకులను ఎన్నిసార్లు కోరినా వారి నుంచి స్పందన లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి చొవరతో ప్రభుత్వం ఘట్‌రోడ్డు నిర్మాణానికి సుమారు రూ.5 కోట్లు కేటాయించింది. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ రహదారి నిర్మాణం పూర్తికావడంతో రాకపోకలు సులభతరమయ్యాయని ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొమరాడ మండలం విక్రంపురం నుంచి కంచరపాడుకు వెళ్లే దారి



రూ.5.33 కోట్ల వ్యయంతో నిర్మించిన విక్రంపురం-కంచరపాడు రోడ్డు

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

పాలకొండ రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండలంలోని పొట్లి, జంపరకోట, అక్కిరాజుపేట, చిలకలవలస, వెంకటరాయునివలస, సీతంపేట, బుడ్డమాసింగిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి పర్యటించనున్నారు. పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ మంగళవారం ఈ విషయం తెలిపారు. ప్రచారంలో ఆమెతో పాటు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం మల్లివీడు, బియ్యాలవలస, సవరగూడ, ఎం.సింగుపురం గ్రామాల్లో కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ప్వాతీపురంటౌన్: హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.ఆనందరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన హోం ఓటింగ్‌కు సంబంధించి ఫారం12–డి పత్రాలను పట్టణంలో పలువురికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 ఏళ్లు నిండిన వయోవృద్ధులు, దివ్యాంగులకు ఎలక్షన్ కమిషన్ హోం ఓటింగ్ అవకాశం కల్పించిందని, అందుకోసం దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఫారం 12–డితో హోం ఓటింగ్ దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు.

369 మందికి ఎన్నికల డ్యూటీ

వీరఘట్టం: మండలంలో సచివాలయ ఉద్యోగుల నుండి ఉపాధ్యాయులు, వ్యవసాయ శాఖ అధికారులు ఇలా పలు ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న 369 మందికి ఎన్నికల డ్యూటీ వేసినట్లు తహసీల్దార్ జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 86 మంది పోలింగ్ ఆఫీసర్లు, 50 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 233 అదనపు పోలింగ్ ఆఫీసర్లు ఉన్నారని తెలిపారు. వీరందరికీ ఆర్డర్ కాపీలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వీరందరికీ ఈ నెల 12 నుండి 16 వరకు నియోజకవర్గ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

శంబర పోలమాంబ ఆలయంలో పంచాంగ శ్రవణం

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉగాది పండగ సందర్భంగా తెలుగు భాషా పండితుడు బంకుపల్లి లక్ష్మీనారాయణ పంచాంగ పఠనం చేశారు. పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులకు ఈఏడాది సకాలంలో వర్షాలు కురుస్తాయని, పంటలు బాగాపండుతాయని తెలియజేశారు. విద్య, వైద్య సాంకేతిక రంగాల్లో ప్రజలు రాణిస్తారని చెప్పారు. ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని, దేవాలయాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఈవో వీవీ సూర్యనారాయణ, తీళ్ల పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో మండుతున్న ఎండలతో ప్రజలు హడలిపోతున్నారు. పగటిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతుండటం, వడ గాలులు వీస్తుండటంతో అన్నివర్గాలపై ఈ ప్రభావం పడుతుంది. ఉదయం 11 గంటల నుంచి ఎండ తీవ్రత మరింతగా ఉండటంతో చిరు వ్యాపారులు, రోడ్లపై బళ్లపై సరుకులు ఉంచి అమ్మకాలు చేపడుతున్న వారు ఎండ ధాటికి గురవుతున్నారు. పగటి పూట ఉష్ణోగ్రతల కారణంగా శరీరంలో నీటి నిల్వలు తగ్గి వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. దాదాపు 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు మంగళవారం నమోదు కావటం, వడగాలులు తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలతో కూడిన సమాచారం సెల్‌ఫోన్లుకు వస్తుండటంతో స్థానికులు అప్రమత్తమయ్యారు.



ఎండ తీవ్రతకు మధ్యాహ్నం ఖాళీగా దర్శనమిస్తున్న ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు

కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



గోవిందమ్మ పేరంటాలను దర్శించుకుంటున్న భక్తులు



పూజలు అందుకుంటున్న కోటదుర్గమ్మ వారు

పాలకొండ: తెలుగు సంవత్సరాది క్రోధి నామ ఉగాది పర్వదినం సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయం కిటకిటలాడింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాల్లో వాహన పూజలు చేశారు. ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం పంచాంగ పఠనం చేసి భక్తులకు వినిపించారు.

జాతరకు పోటెత్తిన భక్తులు

వీరఘట్టం: వీరఘట్టానికి సమీపంలో అచ్చెపువలస వద్ద వెలసిన గోవిందమ్మ పేరంటాల జాతరకు భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉగాది పర్వదినం కావడంతో యజ్ఞకర్త శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన జాతరకు వీరఘట్టంతో పాటు సమీప గ్రామాల ప్రజలు తరలివచ్చారు. గోవిందమ్మ పేరంటాలను దర్శించుకున్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో కవాతు నిర్వహిస్తున్నట్లు ఎస్సై అనీష్ తెలిపారు. మంగళవారం శిఖబడి, బీజేపురం గ్రామాలలో ఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజల వెంటే ఉంటామని తెలియజేసేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిఖబడి గ్రామంలో ప్రజలకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు.



శిఖబడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు



జాతరలో జనాల సందడి

ముగిసిన జాతర

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురం గ్రామంలో ఉమాసహిత కై లాసనాథ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 4 నుంచి నిర్వహించిన పంచమరాత్రి జాతర మహోత్సవాలు సోమవారం రాత్రితో ముగిశాయి. చివరి రోజు జాతరను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనటంతో జాతర లో సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.